www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 274 ISSUE : 274 | ఆదివారం, 1 మార్చి, 2026 SUNDAY, MARCH 1, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసాచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00

## అప్రమత్తంగా ఉండండి

భారత పౌరులకు అడ్వైజరీ



2 లో..



# యుద్ధ భేరి

- టెహ్రాన్, ఇతర కీలక ప్రాంతాల్లో క్షిపణుల వర్షం
- 500లక్ష్యాలపై ఏకకాలంలో దాడి
- ఖమేనీ నివాసంపైనా దాడులు.. జాడ తెలియని నేత
- ఆయన అల్లుడు, కోడలు మృతిచెందినట్టు వార్తలు
- ఇరాన్ రక్షణ మంత్రి, సైన్యాధిపతి మృతి: ఇజ్రాయెల్
- ఇరాన్ ప్రతిదాడులు.. ఇజ్రాయెల్‌పైకి భారీగా క్షిపణుల దాడులు..
- యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, సౌదీ దేశాల్లోని
- అమెరికా స్థావరాలపైనా క్షిపణులు, డ్రోన్లతో దాడులు
- అబుధాబి, దుబాయ్‌లలో ఇద్దరి మృతి
- ఆపకపోతే తీవ్ర పరిణామాలు: ఇరాన్‌కు గల్ఫ్ హెచ్చరిక
- హార్మూజ్ జలసంధి మూసివేత.. సంక్షోభంలో వాణిజ్యం
- గల్ఫ్ గగనతలం మూసివేత.. స్తంభించిన విమానయానం
- దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకున్న వేల మంది
- చమురు ధరలకు రెక్కలు?

## • ఇరాన్‌పై విరుచుకుపడ్డ అమెరికా, ఇజ్రాయెల్

- 200 ఫైటర్ జెట్లతో భీకర దాడి
- 201 మంది మృతి, మృతుల్లో 85 మంది స్కూల్ పిల్లలు



దుబాయ్/వాషింగ్టన్/టెల్ అవీవ్, ఫిబ్రవరి 28: పశ్చిమాసియాలో యుద్ధ భేరి మోగింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. పెద్ద సంఖ్యలో క్షిపణులతో విరుచుకుపడ్డాయి. యుద్ధ విమానాలతోనూ కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీనితో ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగింది. అటు ఇజ్రాయెల్‌పై, ఇటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై పెద్ద సంఖ్యలో క్షిపణులను, డ్రోన్లను ప్రయోగించింది. తమ దేశాల్లోని ప్రాంతాలపై ఇరాన్ దాడులను ఖతార్, బహ్రెయిన్, కువైట్, సౌదీ, యూఈఏ తీవ్రంగా ఖండించాయి. ఇరాన్ దాడులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాయి. దీనితో పశ్చిమాసియా ప్రాంతమంతా అట్టుడుకుతోంది. శనివారం రాత్రి కూడా ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణులు, యుద్ధ విమానాలతో దాడులు కొనసాగించడం.. అటు ఇరాన్ కూడా ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడుతుంటంతో.. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. మరింత ఉధృతంగా దాడులు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు అమెరికా రక్షణ వర్గాలు శనివారం రాత్రి వెల్లడించాయి.

ఇరాన్ అణుశుద్ధిని పూర్తిగా నిలిపివేయాలని, క్షిపణుల సామర్థ్యాన్ని తగ్గించుకోవాలని అమెరికా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇరాన్ ఒప్పందానికి రావాలని, లేకుంటే దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు హెచ్చరించారు కూడా. ఈ క్రమంలో ఒమన్ మధ్యవర్తిత్వంతో స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఇరాన్–అమెరికా మధ్య మూడు దఫాలుగా చర్చలు కూడా జరిగాయి. గురువారం జరిగిన చర్చల అనంతరం అణుశుద్ధి విషయంలో ఇరాన్ దిగివస్తోందని, పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడతాయని కూడా వార్తలు వెలువడ్డాయి. కానీ దీనిపై తాను అంత సంతృప్తిగా లేనని ట్రంప్ శుక్రవారం పేర్కొన్నారు. అన్నట్టుగానే శనివారం ఉదయమే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా శనివారం ఉదయం 9.30 గంటల సమయంలో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తోపాటు 30 కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులను ప్రయోగించాయి. ఇరాన్ క్షిపణి ప్రయోగ వ్యవస్థలు, మిలటరీ స్థావరాలతోపాటు ప్రభుత్వాధినేతలు, మిలటరీ ఉన్నతాధికారులు లక్ష్యంగా యుద్ధ విమానాలతోనూ ఏకకాలంలో దాడులు చేశాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అమెరికా, 'ఆపరేషన్ లయన్ రోర్ (సింహ గర్జన)' పేరుతో ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్ చేపట్టాయి. దీనితో ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమాసియాలోని అన్ని అమెరికా స్థావరాలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేపట్టింది. మిగతా 2లో..



## దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్

- రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

2 లో..



### మార్చి 6నుంచి జూన్ 12 వరకు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

- పౌరసేవలను సులభతరం చేయడంపై జయేశ్‌రంజన్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీ
- ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శుల సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 28:

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు రాష్ట్రంలో ఈ ప్రణాళికను అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ 4 కోట్ల ప్రజల పండుగ సంబురంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకను పురస్కరించుకొని 99 రోజుల పాటు జరిగే 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు, బి.శివధర్ రెడ్డి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి పథంలోనూ, పరిపాలనలోనూ తెలంగాణను తిరుగులేని ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని శాఖల వారిగా అధికారులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు దిశానిర్దేశం చేశారు. "గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర మిగతా 2లో..



# నైపుణ్యాల వెలికితీతకే నూతన ఆవిష్కరణలు

- ఆవిష్కరణలను తిలకిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, (వార్త వేది సూర్య)-ఫిబ్రవరి 28:

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్ని అందిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో టీవర్క్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఇన్నోవేషన ఎక్స్‌పో–2026 కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని మాట్లాడారు. డ్రీమ్ రైస్ స్టార్ట్ నినాదంతో ఇన్నోవేషన మిగతా 2లో..

# మృత్యు విస్ఫోటనం



2 లో..

- 'గోదావరి జిల్లా'లో మరో పెనువిషాదం
- బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించి 21మంది బుగ్గి
- 10 మందికి గాయాలు
- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో భారీ విస్ఫోటం
- శివారు పొలాల మధ్య సూర్యశ్రీ ఫైర్ వర్క్స్
- సింగారమ్మ జాతర కోసం భారీగా ఆర్డర్
- తయారీ పనిలో నిమగ్నమైన కార్మికులు
- చిచ్చుబుడ్లలో మందు కూరుతుండగా నిప్పు
- నారబాంబులకు అంటుకొని వరుస పేలుళ్లు

# ఆ భూములు శారదా పీఠానికే..

- జలమండలికి కేటాయింపులు రద్దు
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 28:

**కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన** భూమిని పీఠానికే కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జలమండలికి కేటాయింపును రద్దు చేయాలని సూచించారు. ఈ మేరకు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై అధికారులతో చర్చించారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో వివిధ నిర్మాణాల తాజా స్థితిని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి మండిపడ్డారు. జలమండలికి కేటాయింపులు రద్దు చేసి పీఠానికే ఆ భూములు కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని ముఖ్యమంత్రి, పీఠం ప్రతినిధులకు సూచించారు.

సంపుటి: 1 సంచిక: 274 వార్త వేదిక సూర్య ఆదివారం, 1 మార్చి, 2026

# యుద్ధ భేరి

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా దాడికి దిగవచ్చనే అంచనాల మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీని ముందుగానే భద్రమైన రహస్య ప్రదేశానికి తరలించినట్లు ఆ దేశ అధికార వర్గాలు వెల్లడించాయి. అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కూడా సురక్షితంగానే ఉన్నట్లు తెలిపాయి. అయితే ఖమేనీ అల్లుడు, కోడలు మృతి చెందినట్టు పేర్కొన్నాయి. కాగా, తమ దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్, ఐఆర్‌జీసీ మిలటరీ కమాండర్ మహమ్మద్ పాక్‌పోర్ మృతిచెందినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. దీనిని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఖండించారు. తమ రక్షణ మంత్రి, ఉన్నతాధికారులు క్షేమంగా ఉన్నట్టు తెలిపారు. తమ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు తమ సార్వభౌమత్వాన్ని సవాలు చేయడమేనని ఖతార్, యూఏఈ, సౌదీ, బహ్రెయిన్ తదితర దేశాలు హెచ్చరించాయి. దాడులు ఆపకుంటే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించాయి. ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా అడ్డుకుంటున్నాయని పేర్కొన్నాయి. ఈ దేశాలన్నీ తమ గగనతలాన్ని మూసేశాయి. పరిస్థితి చక్కబడే వరకు పౌరులెవరూ ఇళ్లలోంచి బయటికి రావొద్దని హెచ్చరించాయి. అమెరికా–ఇరాన్ మధ్య చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న ఒమన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్‌బుసైదీ తాజా పరిణామాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో మూడు దశలుగా ఈ చర్చలు జరిగాయి. అవి పురోగతిలో ఉన్నట్టు అల్‌బుసైదీ గురువారం ప్రకటించారు కూడా. ఇలాంటి సమయంలో అమెరికా దాడులు చేపట్టడం ఆవేదన కలిగించాయని ఆయన శనివారం పేర్కొన్నారు. చర్చలు కీలక దశకు చేరుకుంటున్న సమయంలో అమెరికా దాడితో అంతా నిష్ఫలమైపోయిందని పేర్కొన్నారు. పరిస్థితి మరింత దిగజారకుండా అమెరికా వెంటనే దాడులు ఆపేయాలని అల్ బుసైదీ విజ్ఞప్తి చేశారు.

### ఒమన్‌పై దాడి చేయని ఇరాన్!

గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్‌లోని అన్ని అరబ్ దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై క్షిపణులు ప్రయోగించిన ఇరాన్.. ఒక్క ఒమన్‌పై మాత్రం ఎలాంటి దాడి చేయలేదు. చాలా కాలం నుంచి ఇరాన్‌కు, ఇతర దేశాలకు మధ్యవర్తిగా ఒమన్ కొనసాగుతోంది. ప్రస్తుతం జెనీవాలో జరుగుతున్న అమెరికా–ఇరాన్ చర్చల్లోనూ ఒమన్ మధ్యవర్తిగా ఉంది.

### హార్ముజ్‌లో నిలిచిన రాకపోకలు

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితి నేపథ్యంలో హార్ముజ్ జలసంధిలో రాకపోకలపై ప్రభావం పడింది. జల సంధిలో ప్రయాణాలను నిలిపివేయాలని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించినట్టు వాణిజ్య నౌకలను నిర్వహించే సంస్థలు తెలిపాయి. దీనితో చమురు సహా ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడనుంది. అయితే జల సంధిని మూసివేస్తున్నట్టు ఇరాన్ అధికారికంగా ప్రకటించలేదు. మరోవైపు హార్ముజ్ జలసంధి, అరేబియా సముద్ర ఉత్తర ప్రాంతానికి దూరంగా ఉండాలని అమెరికా రవాణా శాఖ వాణిజ్య నౌకలకు సూచనలు జారీ చేసింది. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లోని అమెరికా నౌకలకు కనీసం 30 నాటికల్ మైళ్లకుపైగా దూరంలో ఉండాలని, లేకుంటే శత్రునౌకలుగా భావించి, చర్యలు చేపట్టే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

### ఖమేనీ నివాసానికి సమీపంలో పేలుడు

టెహ్రాన్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ నివాసం, ప్రధాన కార్యాలయం సమీపంలోనే తొలి క్షిపణి దాడి జరిగింది. తర్వాత ఆ దేశ సైన్యం ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రధాన కార్యాలయానికి సమీపంలో భారీ పేలుళ్లు జరిగాయి. అనంతరం ఏకకాలంలో టెహ్రాన్‌లోని మరికొన్ని ప్రాంతాలతోపాటు కీలకమైన తబ్రిజ్, ఇస్ఫహాన్ పట్టణాలు, బుషెహర్, మినాబ్‌లలోని ఇరాన్ నౌకాదళ స్థావరాలు, మరికొన్ని చోట్ల కూడా భారీగా క్షిపణి దాడులు జరిగాయి. కీలకమైన చబహార్ పోర్టు వద్ద కూడా భారీగా పేలుళ్లు జరిగాయి. శనివారం ఉదయం కాసేపు దాడులు చేసి ఆపేసిన అమెరికా, ఇజ్రాయెల్ రాత్రికి మళ్లీ దాడులు ప్రారంభించి ఇరాన్ మిలటరీ బలానికి కీలకమైన క్షిపణి ప్రయోగ వ్యవస్థలను ధ్వంసం చేయడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాయి. కాగా, చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి 200 యుద్ధ విమానాలతో దాడులు చేశామని, 500కుపైగా లక్ష్యాలను ఛేదించామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, లాంచర్లను ధ్వంసం చేసి.. తర్వాతి దాడులకు మార్గం సుగమం చేశామని తెలిపింది.

పాఠశాలపై క్షిపణి దాడితో 85 మంది మృతి

ఇరాన్‌లోని మినాబ్‌లో బాలికల పాఠశాలపై క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో చిన్నారులు సహా 85 మంది మరణించినట్టుగా ఇరాన్‌కు చెందిన టాస్నిమ్ వార్తా సంస్థ ప్రకటించింది. మినాబ్‌లో ఇరాన్ కీలక మిలటరీ స్థావరం ఉంది. శనివారం ఉదయం దానిపై దాడి చేసిన ఇజ్రాయెల్.. క్షిపణి రక్షణ వ్యవస్థలు, రాడార్లను ధ్వంసం చేసింది. అయితే పాఠశాలపై దాడి అంశాన్ని పరిశీలిస్తున్నామని, సాధారణ పౌరులకు నష్టం జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని బలగాలకు సూచించామని యూఎస్ సెంట్రల్ కమాండ్ శనివారం రాత్రి వెల్లడించింది. ఇక అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ వ్యాప్తంగా 201 మంది చనిపోయారని, 747 మంది గాయపడ్డారని ఇరాన్ రెడ్ క్రిసెంట్ సొసైటీ ప్రకటించింది.

### అప్రమత్తంగా ఉండండి భారత పౌరులకు అడ్వైజరీ

**టెహ్రాన్:** భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఇజ్రాయెల్, ఇరాన్‌లోని భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని అక్కడి భారత రాయబార కార్యాలయాలు అడ్వైజరీ జారీ చేశాయి. సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని, ఎమర్జెన్సీ అలర్ట్స్‌ను ఎప్పటికప్పుడు చూస్తూ ఉండాలని సూచించాయి. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే టెల్‌అవీవ్ భారత రాయబార కార్యాలయం అధికారులను +972–54–7520711 ఫోన్ నంబర్‌లో లేదా cons1. telaviv @mea. gov.in ఈమెయిల్ ఐడీలో సంప్రదించాలని తెలిపాయి. పరిస్థితులు ఆందోళనకరంగా ఉండటం వల్ల అనవసరమైన ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అబుదాబి, యూఏఈ, సౌదీ, జోర్డాన్ తదితర దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు అక్కడ ఉన్న భారతీయులకు ప్రత్యేక అడ్వైజరీ జారీ చేశాయి.

# దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ:** మహిళల్లో గర్భాశాయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్) నివారణ చర్యల్లో భాగంగా దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) టీకా పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ప్రధాని మోదీ శనివారం ఈ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశ సమగ్రాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని, హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం దీనికి నిదర్శనమని తెలిపారు. దేశాన్ని కాంగ్రెస్ పార్టీ అవమానిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలీగ్‌లాగా దేశాన్ని వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ డ్రైవ్‌లో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 14 సంవత్సరాల వయసున్న బాలికలకు ప్రతిఏటా 1.15 కోట్ల టీకాలను పంపిణీ చేయాలన్నది లక్ష్యం. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో ఈ టీకాను ఉచితంగా అందిస్తారు.

# నైపుణ్యాల వెలికితీతకే నూతన ఆవిష్కరణలు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్‌పో–26ను మంథనిలో ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. మంథనిలో ఉన్న టీవర్క్ యూనిట్స్ బృందం కలెక్టర్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటిస్తూ విద్యార్థులు నూతన అవిష్కరణపై ఆసక్తిని పెంపొందించే దిశగా కృషి చేశారన్నారు. నూతన ఆవిష్కరణలు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన డాలర ఆర్థికశక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. టీవర్క్ యూనిట్‌ను మంథనిలో ఏడు నెలల క్రితం ప్రారం భించామని, ఇక్కడ పిల్లలు అనేక నూతన అవిష్కరణ చేసేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చారని తెలిపారు. జిల్లాలో ముందస్తుగా 20 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధన, కృతిమ మేధస్సు పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీవర్క్ సీఈవో జోగేందర్, మున్సిపల్ చైర్మన వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన ముస్కుల సహేందర్‌రెడ్డి, ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరీఫోద్దీన పాల్గొన్నారు.

# పని చేయలేకపోతే తప్పుకోండి!

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)–ఫిబ్రవరి 28:

ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచిందని, ఎవరి పనితీరు ఎలా ఉందో తన దగ్గర పూర్తి సమాచారం ఉందని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుతిమెత్తగా హెచ్చరించారు. పని చేయలేమని భావించే అధికారులు పక్కకు తప్పుకోవాలని, వీలైతే సెలవులో పోయినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కీలక బాధ్యతలను నిర్వర్తించలేమని భావించే అధికారులు లూప్‌లైన్ పోస్టు కావాలనుకుంటే అక్కడికే పంపుతామని తేల్చి చెప్పారని తెలిసింది. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం కూడా తనకు తెలుసని వ్యాఖ్యానించారు. "ఎవరు పని చేస్తున్నారు.. ఎవరు పని చేయడం లేదనే సమాచారం నా దగ్గర ఉంది. పని చేయని అధికారుల వ్యక్తిగత వివరాలను 4వ తేదీన జరిగే కలెక్టర్ల సమావేశంలో బయట పెడతాను" అని స్పష్టం చేశారు. ఆరోజు ప్రతి అధికారి పనితీరు ఎలా ఉందో చర్చిస్తానని చెప్పారు. అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి రేవంత్ శనివారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డితోపాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంవో అధికారులు, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గడచిన రెండున్నరేళ్లలో ఇప్పటి వరకు నిర్ణయాలు తీసుకున్నామని, ఇకపై ఫలితాలు చూపించాలని సూచించారు. ప్రతి ఎన్నికలో కావాల్సినంత బలాన్ని ప్రజలు తనకుఇస్తున్నప్పుడు.. ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని వారికి మంచి చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. అందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం వెనకాడబోదని హెచ్చరించినట్లు తెలిసింది. సమావేశమంతా కార్యదర్శుల పనితీరు చుట్టే జరిగిందని సమాచారం. మీరు రిటైరైన తర్వాత కూడా ప్రజలు గుర్తుంచుకునేలా పని చేయాలంటూ సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. సీఎం కావాలన్న తన లక్ష్యాన్ని చేరుకున్న విధంగానే, అధికారులుగా మీరు ఒక లక్ష్యం పెట్టుకుని అది సాకారమయ్యే దిశగా సాగాలని సూచించారని సమాచారం. పనితీరు బాగాలేని కొన్ని రాష్ట్రాల్లో బలవంతంగా పదవీ విరమణ చేయించారని, తీరు మార్చుకోకపోతే ఆ అంశంపైనా పరిశీలన చేస్తామని నవ్వుతూనే చురకలు అంటించినట్టు తెలిసింది. కొన్ని శాఖల పరిధిలో ఆన్‌లైన్ విధానంలో వచ్చిన దరఖాస్తులను దగ్గర పెట్టుకుని, సంబంధిత వ్యక్తులను పిలిపించుకుని మాట్లాడుతున్నారని, అందుకు సంబంధించిన డేటా మొత్తం తన దగ్గరుందని, అవసరమైనప్పుడు ఆ వివరాలు బయటపెడతానని హెచ్చరించారు. కొన్ని శాఖల అధికారుల మధ్య సమన్వయమే ఉండడం లేదని, వారిని సమన్వయం చేయడానికే తనకు సమయం పడుతోందని అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. ఇకపై అలాంటి పరిస్థితులు ఉత్పన్నమవకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశం ముగిసే సమయంలో 'ఇవ్వాళంతా బాగా రెస్ట్ తీసుకోండి.. రేపటి నుంచి బాగా పనిచేయండి' అని నవ్వుతూనే సూచించారని సమాచారం. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మార్చి ఆరు నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజులపాటు దీనిని అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని, కార్యక్రమం అమలుకు 'ప్రత్యేక లోగో' తయారు చేయాలని నిర్దేశించారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సంబురంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

# మృత్యు విస్ఫోటనం

కాకినాడ, వా్త వేదిక సూర్య)–ఫిబ్రవరి 28:

అది... కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు! గోదావరి కాలువ అవతల పచ్చని పొలాల మధ్య... సూర్యశ్రీ ఫైర్ వర్క్! శనివారం మధ్యాహ్నం 2.10 గంటలు! శుభకార్యాలు, జాతర కోసం భారీగా బాణసంచా తయారు చేయడంలో కార్మికులు నిమగ్నమయ్యారు. అంతలోనే... ఒక్కసారిగా పెను విస్ఫోటం! ఎనిమిది కిలోమీటర్ల దూరానికీ వినిపించిన శబ్దాలు! భూకంపం వచ్చిందా అన్నంతగా కంపించిన పరిసరాలు! వరుసగా పేలుళ్ల మీద పేలుళ్లు జరుగుతూనే ఉన్నాయి. 20 మీటర్ల ఎత్తుదాకా మంటలు ఎగిసి పడ్డాయి. పేలుళ్ల ధాటికి అక్కడికక్కడే 21 మంది చనిపోయారు. బాణసంచా తయారీ కేంద్రానికి సంబంధించిన రెండు షెడ్లు కుప్ప కూలిపోయాయి. కార్మికులకు సంబంధించిన ద్విచక్ర వాహనాలు ముక్కలు ముక్కలుగా విడిపోయాయి. సినిమాల్లో చూపినట్లుగా సైకిళ్లు గాలిలోకి ఎగిరి కిందపడ్డాయి. ఇనుప డ్రమ్ములు, స్తంభాలు తుత్తునియలయ్యాయి. పేలుడు తీవ్రత తెలుపుతూ... ఆ ప్రాంతమంతా మరుభూమిని తలపించింది. వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్ వర్క్ బాణసంచా తయారీ కేంద్రం బాణాసంచా తయారీకి ప్రసిద్ధి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శుభకార్యాలు, జాతరలు, పండగలకు ఇక్కడి నుంచే బాణసంచా వెళ్తుంది. అడబాల శ్రీను అనే వ్యక్తి తన ఇద్దరు కుమారులు అడబాల వీరబాబు, అర్జున్ పేరతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. తాజాగా... జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం సింగారమ్మ చింత అమ్మవారి ఉత్సవాలకోసం భారీ ఆర్డరు వచ్చింది. దీంతో తాత్కాలికంగా మరికొందరు కార్మికులను నియమించుకున్నారు. సామర్లకోట, వేటపాలెం, మేడపాడు తదితర ప్రాంతానికి చెందిన సుమారు 70 మంది శనివారం బాణసంచా తయారీ పనికి వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి వారిలో దాదాపు సగంమంది భోజనానికి వెళ్లారు. మిగిలిన వారంతా పనిలో నిమగ్నమయ్యారు. వివిధ వర్గాల కథనం ప్రకారం... కలర్ చిచ్చుబుడ్ల తయారీ దగ్గరే తొలి చిచ్చు పుట్టుంది. ఈ చిచ్చుబుడ్లలో మందు కూరేందుకు మెల్లగా సుత్తితో కొడతారు. ఆ సమయంలోనే నిప్పు రవ్వ రాజుకుంది. అది పక్కనే ఉన్న 'సెర్చ్ లైట్' అనే మరోరకం బాణసంచాపై పడింది. మెల్లగా పేలుడు మొదలైంది. అక్కడికి దగ్గరే వందల సంఖ్యలో 'నార బాంబులు' (బ్యాటరీ బాంబులు) ఉన్నాయి. వాటికీ మంట అంటుకుంది. దీనికి తోడు... తమిళనాడు నుంచి తెప్పించిన పేలుడు రసాయనం రెండు డ్రమ్ముల్లో నిండుగా ఉంది. ఇంకేముందీ... యుద్ధంలో బాంబులు కురిపిస్తున్నట్లుగా పేలుళ్లు మొదలయ్యాయి. ఆగకుండా... పేలుతూనే ఉన్నాయి. వందల సంఖ్యలో ఉన్న నారబాంబుల వల్లే పేలుళ్ల తీవ్రత ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఆ ప్రాంతం గోదావరి కాలువకు ఆవల, పొలాల మధ్య ఉండటంతో... తక్షణ సహాయం అందే దిక్కూ లేకుండా పోయింది. పెద్ద ఎత్తున ఎగసి పడుతున్న మంటలు, బాణసంచా పేలుడు, దట్టమైన పొగ కారణంగా... లోపలికి వెళ్లలేకపోయామని, అప్పటికే అక్కడున్న చాలామంది ప్రాణాలు కోల్పోయారని స్థానికులు తెలిపారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 గంటల దాకా ఫైరింజనతో మంటలు ఆర్పుతూనే ఉన్నారు. ఈ క్రమంలో బాణసంచా తయారీ కేంద్రంలో ధ్వంసమైన ఒక రేకులషెడ్డు, కాంక్రీట్ భవనం అడుగున సగం కాలకుండా ఉన్న మందుగుండు మళ్లీ పేలింది. ఆ సమయంలో... కలెక్టర్, ఎస్పీ అక్కడే ఉన్నారు. పేలుడు ధాటికి పరుగులు తీశారు.

### మాంసపు ముద్దలుగా...

పేలుళ తీవ్రతకు మృతదేహాలు బొగ్గలుగా మారిపోయాయి. చిందరవందరగా పడిపోయాయి. ఏ మృతదేహం ఎవరిదోకూడా గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. తల, కాళ్లు చేతులు తెగిపడి ఎగిరి... పక్కనే ఉన్న పొలాల్లో మాంసపు ముద్దలు పడ్డాయి. మరికొందరైతే... ఉన్నచోట ఉన్నట్లుగానే బుగ్గి అయ్యారు. మృతుల్లో కొంతమందిని అతికష్టంపై వెతికి పోలీసులు, స్థానికులు గుర్తించారు. ఘటనా స్థలానికి ఐదారువందల మీటర్ల దూరంలోనూ గోదావరి కాలువ గట్టుపై తలలేని మొండెం కనిపించింది. ముద్దలు ముద్దలుగా, తునాతునకలైన మృతదేహాలను ఒకచోట చేర్చి స్ట్రెచర్ మీద ఎక్కించేందుకు ఫైర్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సైతం వణికిపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని మృతదేహాలను అతికష్టం మీద గుర్తించగా... గుర్తుపట్టలేని మృతదేహాలకు నంబర్లు వేసి సామర్లకోట మార్చురీకి తరలించారు.



మార్చి 6నుంచి జూన్ 12 వరకు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

స్థాయి వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను విజయవంతం చేయాలి. అందుకు అవసరమైన ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి ఆచరణలో చూపెట్టాలి. ఈ కార్యక్రమానికి ప్రత్యేక లోగో తయారు చేయడమే కాకుండా రాష్ట్రమంతా 99 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను షెడ్యూలును సీఎస్ గారు రూపొందించాలి. ఈ 99 రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్‌తో పాటు అన్ని విభాగాలు, రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని ఆఫీసుల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా పక్కాగా అమలు చేయాలి. 99 రోజుల కార్యక్రమ పురోగతిని వ్యక్తిగతంగా పరిశీలిస్తా. క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తా. పరిపాలనలో అధునాతన సాంకేతిక నైపుణ్యాన్ని సమర్థంగా వినియోగించాలి. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పౌరులకు అవసరమైన సేవలన్నింటినీ మరింత సులభతరం చేయాలి. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలు తీసుకురావాలి. కరెంట్ మీటర్, తమ ఇంటి అనుమతి, నల్లా కనెక్షన్ వరకు ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనుమతులకు, సేవలకు ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేకుండా జరగాలి. వాహనం కొన్న షోరూంలోనే రిజిస్ట్రేషన్ జరిగే విధానం అమలోకి వచ్చినట్టుగా, ప్రతి విభాగంలోనూ సంస్కరణలు తీసుకురావాలి. ఏ ఫైలు, ఏ ఆర్జీ ఎక్కడ ఉందో దరఖాస్తుదారు తెలుసుకునే సునాయస విధానం అమలులోకి రావాలి. సమూల మార్పులతో సాంకేతిక సంస్కరణలు అమలు చేసేందుకు సీనియర్ ఐఏఎస్ అధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, మూడు వారాల్లో కమిటీ నివేదికను అందించాలి. ప్రతి విభాగం ఈ – ఆఫీస్ విధానం, డిజిటల్ గవర్నెన్స్‌ను అమలు చేయాలి. అన్ని శాఖలకు సంబంధించిన డేటా నిల్వ చేస్తున్న పాత కాలం సర్వర్లను రాబోయే 20 సంవత్సరాలకు సరిపడేలా అప్‌డేట్ చేయాలి. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయడానికి సాంకేతికతను వినియోగించాలి. మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, ఆరోగ్య శ్రీ అర్హులైన వారందరికీ చేరాలి. సొంత స్థలముండి ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ది అందాలి. రేషన్ కార్డులు దరఖాస్తే చేసుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించేలా రాష్ట్రంలో వంద మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తున్నాం. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేయటంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలను మెరుగుపరిచే విధానాలు అమలు చేయాలి. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా ప్రభుత్వం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు జోన్లుగా విభజించి దేశంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాం. కోర్ అర్బన్ రీజియన్‌లో చేపట్టాల్సిన సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలి. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు, ఉన్న పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీకి దాదాపు 10 వేల చ.కి.మీ మాన్యుఫాక్చరింగ్ జోన్ భవిష్యత్తులోనూ కీలకంగా మారుతుంది. అన్ని విభాగాల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల డేటా కార్యదర్శుల వద్ద సిద్ధంగా ఉండాలి. రాష్ట్రంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి. బడ్జెట్ ప్రతిపాదనల్లో వీటిని చేర్చాలి. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గోబల్ సమ్మిట్‌తో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి దాదాపు రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ ఒప్పందాలు ఫలవంతమయ్యేలా కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి అవి గ్రౌండ య్యేంత వరకు సంప్రదింపులు జరపాలి. దేశంలోనే ఎక్కడా లేని విధంగా #Future City నిర్మాణం, అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలకు కోరుకున్న మార్పును అందిస్తామనే హామీతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ రోజుతో ప్రభుత్వం రెండేళ్లు మూడు నెలలు పూర్తి చేసుకుంది. ప్రజలు మార్పును స్వాగతి స్తున్నారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబె ట్టుకునేందుకు పునరంకిత భావంతో ముందుకు సాగాల్సిన సమయం వచ్చింది. ఇప్పటివరకు సాధించిన విజయాలను నిజాయితీగా అంచనా వేసుకుని, ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయో అధికారులు గుర్తించాలి. వచ్చే ఎన్నికల నాటికి మిగిలిన రెండేళ్లు తొమ్మిది నెలలకు సరైన దిశా నిర్దేశంతో కార్యాచరణ రూపొందించుకోవాలి. ప్రజలు చూపిన విశ్వాసాన్ని మాటలతో కాకుండా సుపరిపాలనతో గౌరవించాల్సిన బాధ్యత తనతో పాటు అధికారులు అందరిపైనా ఉంది.." అని ముఖ్యమంత్రి గారు మార్గనిర్దేశం చేశారు.

# కాంగ్రెస్ పాలనలో పాతాళానికి హైదరాబాద్

- సీఎం రేవంత్ అవినీతి, అక్రమాల వల్లనే ఈ స్థితి..
- పారిశుధ్యం నుంచి ప్రజారవాణా దాకా అన్నీ ఇబ్బందులే
- రియల్ ఎస్టేట్ కోసమే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీలు..
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)–ఫిబ్రవరి 28:

రెండేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విశ్వనగరం హైదరాబాద్ పతనావస్థకు చేరుకున్నదని బీఆర్‌ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పదేండ్లలో కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ మెట్రో నగరంగా తీర్చిదిద్దామని, కానీ రేవంత్‌రెడ్డి పాతాళానికి తొకేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 'నగర ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదన్న ఏకైక కక్షతో హైదరాబాద్ మౌలిక సదుపాయాలను గాలికి వదిలేశారు. పారిశుద్ధ్యం నుంచి ప్రజారవాణా వరకు అన్ని రంగాలు కుప్పకూలాయి' అని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో శనివారం జీహెచ్‌ఎంసీ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ, అసెంబ్లీ సమావేశాలో నగరానికి సంబంధించి లేవనెత్తాల్సిన అంశాలపై విస్తృతంగా చర్చించి, దిశానిర్దేశం చేశారు. హైడ్రాతో మొదలుపెట్టి, టీడీఆర్ స్కామ్, పారిశ్రామిక భూముల కేటాయింపు వరకు అన్నింటిలోనూ ముఖ్యమంత్రి కుటుంబసభ్యులు, అనుచరులు వేల కోట్లు దోచుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం తన భూములకు విలువ పెంచుకోవడం కోసమే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అన్నారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి మెట్రో నగరంగా తీర్చిదిద్దిందని గుర్తుచేశారు.







# ప్రజా ప్రభుత్వం అంటే మాటలు కాదు, చేతలు ఇంటింటికీ చేరుతున్న అభివృద్ధి, సంక్షేమం

**ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న మార్పే అందుకు సాక్ష్యం**

**పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన**

**ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్**

దేవరకొండ ఫిబ్రవరి 28 (వార్త వేదిక సూర్య):

డిండి మండలంలోని ఎర్రగుంట పల్లి, వావిల్ కోల్ రహమంతాపూర్,కందుకూరు, సింగరాజు,పల్లి, తవక్లాపూర్ గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య కార్యాలయ భావన నిర్మాణ పనులకు సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కందుకూరు స్కూల్ కాంపౌండ్ వాల్ శంకుస్థాపన చేసిన అనంతరం సీసీ రోడ్డును ప్రారంభించారు.సింగరాజు పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి, గ్రామస్తులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శక్రు తండాలో 5.00 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. తవక్లాపూర్ గ్రామం నుండి వీరబోయిన వై జంక్షన్ వరకు 223.00 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చెర్కుపల్లి గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అడపాల పర్వత్ రెడ్డి ద్వాదశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని, పర్వత్ రెడ్డి గారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి ఈ విఓ భవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకం ఎన్ ఆర్ జి ఎస్ కింద మంజూరైన 10 లక్షల రూపాయల నిధులతో గ్రామ సమాఖ్య (వి ఓ) భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్ణీత కాలపరిమితిలోగా నాణ్యతతో ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని మహిళా సంఘాలు మరియు స్థానిక అవసరాల కోసం కేటాయించిన నిధులతో నిర్మించనున్న భవనాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ పొట్ట మురళినీ పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ ఫిబ్రవరి 28(వార్త వేదిక సూర్య):



దేవరకొండ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ పొట్ట మురళి ఇటీవల అనారోగ్యంతో హైదరా బాద్‌లోని ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివా రం ఆరోగ్య ఆసుపత్రిలో పొట్ట మురళి నీ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవర కొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, ముదిగొండ హరిదాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు



## ఆపదలో అన్ని తానై బాల రాముడు బాధితులకి భరోసా



దేవరకొండ ఫిబ్రవరి 28 (వార్త వేదిక సూర్య):

దేవరకొండ పట్టణంలోని 13వ వార్డుకు చెందిన మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ అలీమ్ మొద్దీన్ మరణించిన విషయం తెలుసుకొని నేడు వారి స్వగృహంలో మహమ్మద్ అబ్దుల్ అలీమ్ మొద్దీన్ గారి భౌతిక కాయానికి నివాళులర్పించి,బాధిత కుటుంబానికి పరామర్శించి,వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం పట్టణంలోని 1వ వార్డుకు చెందిన పార్వతమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారితో పాటు మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు,మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ కౌన్సిలర్ పున్నబోయిన సైదులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ విమానాశ్రయ రన్‌వే కుదింపు!

**పెద్ద విమానాలిక్కడ దిగలేవు**

**తెలుగు స్క్రైబ్ ఎక్స్‌క్లూజివ్:**

**వరంగల్ ఎయిర్‌పోర్టు రన్‌వే - 2.5 కి.మీ.**

**బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే - 3.2 కి.మీ.**

**శంషాబాద్ ఎయిర్‌పోర్టు రన్‌వే 4.2 కి.మీ.**

**విజయవాడ ఎయిర్‌పోర్టు రన్‌వే 3.36 కి.మీ.**



గత రెండేళ్లుగా వరంగల్ వాసులను ఊరిస్తున్న రేవంత్ ప్రభుత్వం చివరికి ఉసురోమనిపించింది. వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కడుతున్నం అని భారీస్థాయిలో ప్రచారం చేసుకున్న రాష్ట్ర కాంగ్రెస్, కేంద్ర బీజేపీ సర్కార్లు, చివరికి రన్‌వే సైజును కేవలం 2.5 కిలోమీటర్లకు కుదించి వరంగల్ ప్రజలను నిరుత్సాహానికి గురిచేశారు. కనీసం 2.9 కిలోమీటర్ల రన్‌వే ఉంటే కానీ పెద్ద విమానాలు, అంతర్జాతీయ విమానాలు (వైడ్ బాడీ) దిగడానికి వీలు కాదు. అలాంటప్పుడు కేవలం 2.5 కిలోమీటర్ల పొడవైన రన్‌వేతో వరంగల్ విమానాశ్రయం కట్టాలని నిర్ణయించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. గమనించాల్సిన విషయం ఏమిటంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్టును 3.9 కిలోమీటర్ల పొడవైన రన్‌వేతో కట్టాలని ప్రతిపాదించారు. అలా కట్టి ఉంటే ప్రపంచంలోని అతి పెద్ద విమానం కూడా ఇక్కడ ల్యాండ్ అయ్యే సౌకర్యం ఉండేది. వరంగల్ ఎయిర్‌పోర్టు టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టులో కూడా రన్‌వే పొడవు 2.9 కిలోమీటర్లు ఉంటుంది అని స్పష్టంగా పేర్కొన్నారు.తీరా ఈ వారం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజరపు రాం మోహన్ నాయుడు సమావేశమయ్యి అనంతరం ఇచ్చిన ప్రకటనలో ఎయిర్‌పోర్టు రన్‌వే పొడవు 2.5 కిలోమీటర్లుగా పేర్కొన్నారు. అంటే దీనర్థం వరంగల్ ఎయిర్‌పోర్టు కేవలం చిన్న డొమెస్టిక్ విమానాలు మాత్రమే దిగేందుకు వీలుగా ఉంటుంది. పెద్ద డొమెస్టిక్ విమానాలు కానీ, అంతర్జాతీయ విమాన సర్వీసులు కానీ నడపడానికి ఈ రన్‌వేతో వీలు కాదు. ఈ విషయం తెలిసినప్పటి నుండి వరంగల్ నెటిజెన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో వందేళ్ళ క్రితం కట్టిన హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులోనే 3.2 కిలోమీటర్ల రన్‌వే ఉంది.ఇక 2008లో మొదలైన శంషాబాద్ విమానాశ్రయం రన్‌వే ఏకంగా 4.2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. పక్క రాష్ట్రంలోని విజయవాడ ఎయిర్‌పోర్టు రన్‌వే పొడవు 3.36 కిలోమీటర్లు ఉండగా వైజాగ్ విమానాశ్రయంలో రన్‌వే పొడవు 3.0 కిలోమీటర్లు ఉంది. మరి అత్యాధునికంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో కడతాం అంటున్న వరంగల్ ఎయిర్‌పోర్టు కేవలం 2.5 కిలోమీటర్ల బుజ్జి రన్‌వేతో కడితే ఏం ప్రయోజనం అనే చర్చ ఇప్పుడు మొదలైంది.

## రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాల్లో ఒక రాజ్యసభ స్థానాన్ని గిరిజనులకే కేటాయించాలి

**మోహన్ పవర్ డిమాండ్**

దేవరకొండ ఫిబ్రవరి 28(వార్త వేదిక సూర్య):



తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాల్లో సామాజిక న్యాయం పాటించాలని, అందులో ఒక స్థానాన్ని ఖచ్చితంగా గిరిజన సామాజిక వర్గానికి కేటాయించాలని గిరిజన సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ పవర్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.పార్టీ కోసం అంకితభావం కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, దశాబ్దాలుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న బిల్లాయ నాయక్, రాములు నాయక్, మరియు రవీందర్ నాయక్ వంటి సీనియర్ గిరిజన నాయకులకు ఈసారి పెద్దల సభలో అవకాశం కల్పించాలి. రాజకీయ ప్రాతినిధ్యం: రాష్ట్ర జనాభాలో కీలకమైన గిరిజనులకు సముచిత స్థానం కల్పించడం ద్వారానే సామాజిక తెలంగాణ లక్ష్యం నెరవేరుతుందని ఆయన పేర్కొన్నారు న్యాయం చేయాలి: గత ఎన్నికల్లో గిరిజన ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ రావడంలో ఈ నాయకుల పాత్ర కీలకం. కావున, వారి సేవలను గుర్తించి రాజ్యసభకు పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల పట్ల ఉన్న తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని గిరిజన నేతలకు అవకాశం ఇవ్వాలని మోహన్ పవర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## రోడ్డు భద్రత నియమాలను పాటించాలి



గట్టుప్పల.ఫిబ్రవరి.28.వార్త వేదిక సూర్య:

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని గట్టుప్పల మండల కేంద్రం లో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదల నివారణ పై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదలను తగ్గించి సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలనే ఉద్దేశ్యం తో కార్యక్రమన్నీ నిర్వహిస్తున్నామని తెల్లవారు.రోడ్డు ప్రమాదల్లో అధిక శాతం డ్రైవర్ల నిర్లక్ష్యం అతివేగం మద్యం తాగి వాహనం నడపడం మొబైల్ ఫోన్ వినియోగం చూపు సమస్యల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు అవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ. ఎస్ఐ ఆంజయ్య,కొండల్ రెడ్డి, అఫ్రీన్ పోలీసులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ పరిశోధనల ద్వారా దేశం అభివృద్ధి దశలో పయనిస్తుంది

**భారత్ భవిత స్కూల్ కరస్పాండెంట్ మోదుగు సత్తి రెడ్డి**



నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య )

సైన్స్ పరిశోధనల ద్వారా దేశం అభివృద్ధి దశలో పయనిస్తుందని భారత్ భవిత స్కూల్ కరస్పాండెంట్ మోదుగు సత్తి రెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాలలో సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవితాన్ని మార్చే శక్తి సైన్స్ కు ఉందని, దైనందిన జీవితంలో సైన్స్ ప్రభావం ఎంతో ఉందని కరోనా సమయంలో కోవిడ్ వ్యాక్సిన్ లాంటి అద్భుతాలు ఎంతో ప్రయోగం ద్వారా ఉపయోగకరంగా పనిచేశాయి అన్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వ్యవసాయ ఆధునీకరణ పరికరాల ద్వారా ఎంతో అభివృద్ధి దశలో పయనిస్తున్నామని అన్నారు. భారత్ ను సైన్స్ సామ్రాజ్యంగా మార్చేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని సివి రామన్ ఆశయాల సాధన కోసం శ్రమించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ఫెయిర్ లో తయారుచేసిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోదుగు జ్యోతి, ఇంచార్జ్ లక్ష్మి, సైన్స్ టీచర్స్ డాక్టర్ సుధాకర్, కావ్య శ్రీ, ఉపాధ్యాయులు నాగేందర్, ఉపేందర్, మౌలానా, నాగయ్య, బెంజిమెన్, వార్డెన్లు కార్తీక్, స్వాతి, ఆయాలు రేణుక, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, రాష్ట్ర నాయకులు





దేవరకొండ ఫిబ్రవరి 28 (వార్త వేదిక సూర్య):

కొండమల్లెపల్లి మండల పరిధిలోని బుడ్డోని తండా లో నెలకొల్పిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్,నేనావత్ కిషన్ నాయక్ అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు స్వామి వారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ లోని ప్రకాశం బజార్ లో ఉన్న బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి స్కూల్లో స్వపరిపాలన దినోత్సవం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 4, 5 తరగతుల విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధిస్తూ తమ నాయకత్వ నైపుణ్యాలను చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి జి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు కె. రామకృష్ణ, కెపిజి పి హెచ్ ఎస్ బొట్టుగూడ పరిపాలనా అధికారిణి టి. సుధారాణి ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులను అభినందించారు. జె. లోకేశ్వరి డి ఈ ఓ గా, మహబూబ్ పాషా డిప్యూటీ ఈ ఓ గా , ఏ. స్వాతి ఎం ఈ ఓ గా, ఎం.డి. అబాన్ ప్రధానోపాధ్యాయుడిగా, డి. హర్షిత్ పి ఈ టి గా బాధ్యతలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, బాధ్యతా భావం,నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా ఉపయోగ పడిందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

## కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్న నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత

నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య)

డీసీసీ అధ్యక్షులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా 8 వ రోజు, వికారాబాద్ మండలం మదన పల్లి గ్రామంలో మహాత్మా గాం ధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ ఆర్ఈజీఏ) కార్మికులతో కలిసి నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత క్షేత్ర స్థాయిలో పాల్గొని, కార్మికులతో కలిసి పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి జీవన పరిస్థితులు, ఉపాధి అవకాశాలు,





ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, అనంతరం కార్మికులతో కలిసి టిఫిన్ చేసి వారితో స్నేహపూర్వకంగా మమేకమయ్యారు.





టైలర్స్ డే సందర్భంగా నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో టైలర్స్ యూనియన్ మరియు మేరు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన జెండాను గౌరవ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో టైలర్ల పాత్ర ఎంతో కీలకమని, వారి శ్రమతోనే ప్రతి కుటుంబం సంతోషంగా పండుగలు జరుపుకుంటుందని తెలిపారు. టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

-నకిరేకల్, ఫిబ్రవరి 28 (వార్త వేదిక సూర్య)




దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురపాలక సభ్యుల సన్మాన కార్యక్రమం లో 16వ వార్డ్ కౌన్సిలర్ కేతవత్ రూప్లా గారికి అసోసియేషన్ అధ్యక్షులు ఎన్విటీ మరియు సభ్యులు సన్మానం చేయడం జరిగింది.

-దేవరకొండ ఫిబ్రవరి 28 (వార్త వేదిక సూర్య)

# కాబోయే వైద్యులు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడం పై దృష్టి సారించాలి





**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య )** కాబోయే వైద్యులు పట్టణ ప్రాంతం తో పాటు, గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.శనివారం ఆయన నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల లో నిర్వహిస్తున్న వైద కళాశాల వార్షికోత్సవ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.పట్టణ ప్రాంతంలో ప్రజలకు 75 శాతం నాణ్యమైన వైద్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉన్నాయని,అయితే ఈ శాతం గ్రామీణ ప్రాంతంల కేవలం 35% మాత్రమే ఉన్నాయన్నారు. ప్రభుత్వపరంగా ఆరోగ్య సదుపాయాలతో పాటు, ప్రాథమిక వైద్యరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాల ద్వారా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ, ఇంకా 65% మంది గ్రామీణ ప్రాంతంలో ప్రజలు సరైన వైద్యశాలు పొందలేకపోతున్నారని, అందువల్ల వైద్యులందరూ గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడంపై దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఎంబీబీఎస్ అంతంలేని చదువని, భవిష్యత్తులో పీజీ, స్పెషలైజేషన్ కి ఇది ఉపయోగపడుతుందని, అంతేకాక ఎంచుకున్న సబ్జెక్టులో నిష్ణాతులు కావాల్సిన అవసరం ఉందని, అందుకు వైద్య విద్యార్థులు భవిష్యత్తులో మంచి సబ్జెక్టులు ఎంచుకొని విజయం సాధించాలని ఆశించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన జిమ్ ను ప్రారంభించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామి వారి రథోత్సవ జాతర



- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ ఫిబ్రవరి 28( వార్త వేదిక సూర్య):**-నేరేడుగొమ్ము మండల కేంద్రంలో కొండపైన కొలువుదీరిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి జాతర శుక్రవారం రాత్రి కార్యక్రమంలో పాల్గొని, శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకొని, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆశీస్సులు దేవరకొండ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, స్వామి దయా కరుణా కటాక్షాలతో దేవరకొండ శాంతి, సుభిక్షాలతో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు.గ్రామ నాయకులు, వేద పండితులు అందించిన ఆత్మీయ స్వాగతానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.దేవరకొండ నియోజకవర్గ ప్రాంత రైతంగానికి సాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేబడుతుంది అని అన్నారుఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మురికి కాలువ పూడిక తీయించిన జంతిక విజయ్

**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య)**



తిప్పర్థి మండలం లోని మామిడాల గ్రామంలో గత మూడు సంవత్సరాల నుంచి మురికి కాలువ సమస్యతో తో ఇబ్బందులు పడుతున్నటువంటి వార్డు సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే 8 వ వార్డు మెంబర్ జంతిక విజయ్ స్పందిం చి కాలువ లో ఉ న్న చెత్త ను శుభ్రం చేయించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ..గత పాలన లో సర్పంచికి చెప్పిన చేయలేని పరిస్థితి ఉంది. ఇంత కుముందుకు కార్యదర్శికి చెప్పినా చేయలేని పరిస్థితి. పాలకవర్గంలో గెలవగానే నా దృష్టికి తెచ్చినటువంటి ప్రజలు నాకు ఈ సమస్య ఉంది అని చెప్పగానే వెంటనే స్పందించి గ్రామపంచాయతీ సిబ్బందితో మురికి కాలువ సంబంధించినటువంటి మట్టిని మొత్తాన్ని క్లియర్ చేయడం జరిగింది. అదే విధంగా మూడు సంవత్సరాలు నుంచి ఎనిమిదవ వార్డు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాలువ సమస్య గాని, వాటర్ సమస్య గాని వాటన్నిటిని త్వరలోనే తీర్చుతానని వాళ్ళకి మాట ఇవ్వడం జరిగింది.

## మధ్యాహ్న సమయంలో తాళం వేసి ఇంట్లో నుండి ఆరు గ్రాముల బంగారం ఉంగరం మరియు 5 వేల రూపాయల నగదు చోరీ

**దేవరకొండ ఫిబ్రవరి 28(వార్త వేదిక సూర్య):**



కొండమల్లేపల్లి కి చెందిన బూరుగు లోకేశ్వర్ తండ్రి శ్రీరాములు అను వ్యక్తి శనివారం రోజు ఉదయం 11 గంటల సమయంలో తన ఇంటికి తాళం వేసి తన చెల్లెలు అయిన బూరుగు జయమ్మ ఇంటికి వెళ్లినాడు తిరిగి మధ్యాహ్న ఒంటిగంట పదినిమిషాల సమయంలో వచ్చి చూడగా ఇంటి తలుపులు పగలగొట్టి బీరువా తాళం తెరిచి అందులో ఉన్న ఆరు గ్రాముల బంగారు ఉంగరం మరియు ఐదు వేల రూపాయల నగదును గుర్తు లేను దొంగలు దొంగిలించినట్లుగా ఫిర్యాదుగా చేసి దర్యాప్తు కొనసాగుతున్నది ఇట్లు ఎస్సై కొండమల్లపల్లి నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన కొడిదల లక్ష్మమ్మ గారు అనారోగ్యంతో మరణించగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిన.,గౌరవ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు..

విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితే

ఉన్నత శిఖరాలను అదిరోహింవచ్చు.

నేటి బాలలే రేపటి పౌరులని

వ్యాఖ్యానించిన ప్రధానోపాధ్యాయులు..



**గుండాల వార్త వేదిక సూర్య ఫిబ్రవరి 28 శనివారం :**

స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా సుద్దాల జిల్లా పరిషత్ ఉ న్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక సభ ఏర్పటు ప్రాంగణంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు స్వపరిపాలనపై ప్రసంగాలు చేసి, దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంత ముఖ్యమో వివరించారు. కొందరు విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించగా, మరికొందరు చిన్న నాటికల ద్వారా ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి పౌరులుగా ఎదగాలని, సమాజానికి సేవ చేయాలనే తపన కలిగి ఉండాలని సూచించారు. స్వపరిపాలన దినోత్సవం విద్యార్థుల్లో ప్రజాస్వామ్య భావనలు పెంపొందించేలా, దేశం పట్ల బాధ్యతను గుర్తు చేసేలా నిర్వహించబడిందని ప్రదనోపాధ్యాయులు అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్నె అగ్గి రాములు,జ్ఞాన ప్రసన్న ఉమారాణి నాగేష్ మల్సూర్ అమరేందర్ రాఘవేందర్ వసుంధర వెంకన్న లింగయ్య హనుమంతు మరియు సి ఆర్ పి బసవలింగం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

**మోత్కూరు, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య):** ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అబ్జర్వర్లు జి.రవి, పి గురువారెడ్డి కోరారు. శనివారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సదుపాయాల విషయంలో ఏలాంటి లోటు పాటు కాకుండా చూస ుకోవాల ని సూచించగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పరీక్ష కేంద్రం చీప్ సూపరిండెంట్ పి విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి. జ్యోతి , డి.ఓ.కవిత పాల్గొన్నారు. కాగా జనరల్ గ్రూపులో 361 విద్యార్థులకు 355 మంది హాజరయ్యారని, ఆరుగురు గైర్హాజరు ఒకేషనల్ 95 మంది విద్యార్థులగాను 93 మంది విద్యార్థులు హాజరయ్యారని,ఇద్దరు గైర్హాజారు అయ్యినట్లు సి.ఎస్. విజయలక్ష్మి పేర్కొన్నారు మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ లకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం. . మోత్కూరు, ఫిబ్రవరి 28 ( వార్త వేదిక సూర్య ) : ఇటీవల నూతనంగా ఎన్నికైన మోత్కూరు మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న, సోమ నర్సయ్య వైస్ చైర్మెన్ పల్లేర్ల వెంకన్న గుప్తా లను శనివారం మోత్కూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మోత్కూర్ ప్రదీప్ శర్మ, జర్నలిస్టులు కూరెళ్ల వెంకన్న , గాదే బోయిన నాగరాజు, బొడిగె శ్రీహరి, కూరెళ్ళ విష్ణు, అవిశెట్టి యాదగిరి, గోపాల్ దాస్ సాయి, వారాల రాకేష్ కూరెళ్ళ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ పై బురద చల్లడం మానుకోవాలి

- ప్రజా ప్రభుత్వం పై అపోహలు సృష్టించొద్దు
- ఓబీసీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్



**ఆత్మకూరు (ఎం), ఫిబ్రవరి 28, (వార్త వేదిక సూర్య):**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల ముఖ్యంగా బిఆర్ఎస్ మద్దతుతో గెలిచిన నూతన సర్పంచ్‌లకు, అధికార కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల విషయంలో మొండిచేయి చూపుతోందనే ఆరోపణలు ముమ్మాటికీ అసత్యం ప్రచారాలు మానుకోవాలి అని ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్ అన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..కావాలని రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్ సర్పంచ్‌లు ప్రభుత్వం పై బురద చల్లడం మానుకోవాలి.కాంగ్రెస్ మద్దతుదారులు గెలిచిన గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు వేగంగా అందుతుండగా, బిఆర్ఎస్ గెలిచిన గ్రామాల్లో ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయనే విమర్శలు మానుకోవాలి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో అన్ని గ్రామ పంచాయతీ పరిధిలోఇటీవల ప్రతి పంచాయతీకి (చిన్న గ్రామాలకు ₹5 లక్షలు, పెద్ద గ్రామాలకు ₹10 లక్షలు) ప్రత్యేక నిధులు ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. నిధుల పంపిణీలో ఎలాంటి వివక్ష లేదని, నిబంధనల ప్రకారమే నిధులు విడుదలవుతాయని,రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, అభివృద్ధిలో పార్టీల రంగులు ఉ ండకూడదని,మహిళా సంఘం భవనాలు ,డ్రైనేజీలు, సిసి రోడ్లు, వీధి దీపాల వంటి అత్యవసర పనులు ముమ్మరంగా సాగుతున్నాయని,గత బిఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను అప్పుల పాలు చేసిందని, తాము వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నాము అభివృద్ధి పథంలో నడపడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవం

స్వామివారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలి

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్

**దేవరకొండ ఫిబ్రవరి 28 (వార్త వేదిక సూర్య):**

శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ గారు పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ విరాళం దేవాలయ నిర్మాణానికి తన వంతు సహకారంగా రూ. 1,00,116/- (అక్షరాలా లక్షా నూట పదహారు రూపాయలు) విరాళాన్ని ప్రకటించి, తన ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేతావత్ భీల్యా నాయక్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు "దేవాలయాల నిర్మాణంలో భాగస్వామ్యం కావడం పూర్వజన్మ సుకృతం. భక్తి మార్గం మనిషికి మానసిక ప్రశాంతతను ఇస్తుంది.





# అక్షరలో ఘనముగా జాతీయ సైన్స్ దినోత్సవం





**దంతాలపల్లి, ఫిబ్రవరి 28(వార్త వేదిక సూర్య)**

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో లోని అక్షర హైస్కూల్ లో జరిగిన సైన్స్ దినోత్సవం సంబరాలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలను ఉద్దేశించి స్కూల్ కారస్పాడెంట్ ,ప్రిన్సిపల్ సింగరపు యాకయ్య మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో విద్యార్థులు తమ అభిరుచినీ పెంచుకోవాలి అని తద్వారా భవిష్యత్తులో భావి భారత శాస్త్ర వేత్తలు అయి తల్లి తండ్రుల మరియు చదువు నేర్పిన గురువుల పేరును ఇనుమడింప చేయాలని తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన ప్రయోగాలు పరిశీలిన చేసి నిత్య జీవితానికి అన్వయిస్తే మీరు శాస్త్ర వేత్తలుగా మారడం ఖాయమని అనంతరం న్యూటన్ మూడో నియమం గురించి ప్రయోగాన్ని తన చేతుల మీదుగా చేయడం జరిగింది అదేవిధంగా రామన్ జీవితాన్ని గురించి సుదీర్ఘంగా మాట్లాడారు సైన్స్ టీచర్ రఘురామ్ మాట్లాడుతూ ప్రిన్సిపల్ చెప్పిన విషయాలను పాటించాలని మరియు సైన్స్ సాంకేతిక పరిజ్ఞానం గురించి విషయాలు పిల్లలతో పంచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.శ్రీధర్ ఉపాద్యాని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీలపై కులవివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: ఆర్ఐ సుమన్



**మోత్కూరు, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య):**

ఎస్సీ ఎస్టీ లపై ఎవరైనా కుల వివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్.ఐ. సుమన్ హెచ్చరించారు. శనివారం మోత్కూరు మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామంలో ని అంబేద్కర్ కమిటీ హాల్ లో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలకు రానివ్వకుండా ఎవరైనా అడ్డుపడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ కులాలకు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వార్డు కౌన్సిలర్ కొండ శోభ సోమల్లు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ జ్యోతి, డాక్టర్ ఉమా, జిపిఓ వెంకటేశం, 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ తొంట భాస్కర్, మున్సిపల్ వార్డు ఆఫీసర్స్ నిఖిల్, ఆంజనేయులు సతీష్, మాజీ కౌన్సిలర్ ఎర్రవెల్లి మల్లమ్మ,మాజీ సర్పంచ్ యాదయ్య, అంగనవాడి టీచర్లు, ఆశ వర్కర్లు గ్రామస్తులు మున్సిపల్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న



**మోత్కూరు, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య ):**

విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రోజు ఉపాధ్యాయులుగా అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా మారిన విద్యార్థులు రానున్న రోజుల్లో సమాజానికి సేవ చేయాలనే తపన కలిగి ఉండాలని సూచించారు.ఈ స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. ముఖ్యమంత్రిగా కే హర్షవర్ధన్, విద్యాశాఖ మంత్రిగా బీసు స్నేహ, ఎమ్మెల్యేగా డి ప్రద్యుమ్న గా వ్యవహరించారు. వివిధ పాత్రలు పోషించిన విద్యార్థులకు వైస్ చైర్మన్ వెంకన్న, 2వ, కౌన్సిలర్ కురిమిళ్ళ ప్రమీల బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవింద రాయుడు , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ఎస్సై ని ఘనంగా సత్కరించిన కమాండెంట్ కె. వీరయ్య



**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య )**

పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలు అందించి శనివారంతో ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై హేమాని నాయక్ 41 సంవత్సరాలు పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై జాటోత్ హేమాని నాయక్ ను, కమాండెంట్ కె. వీరయ్య శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమాండెంట్ వీరయ్య మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన తరువాత తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పని చేస్తూ ప్రజలకు సేవలందించిన అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది హేమాని నాయక్ సేవలు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖ నుంచి ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ దైనందిన కార్యక్రమాల్లో వ్యాయామం,యోగా, ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉద్యోగ విరమణ అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ సి హెచ్ .ఆంజనేయ రెడ్డి, నర్సింగ్ వెంకన్న, ఏవో అతిక్ ఉర్ రహమాన్, మెడికల్ ఆఫీసర్ ఆర్ షర్మిలా దేవి,ఆర్ ఐ లు, ఆర్ ఎస్సై లు, మినిస్టీరియల్ స్టాఫ్, పోలీస్ సిబ్బంది హోంగార్డు , ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కుటుంబ సభ్యులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సైన్స్ పరిజ్ఞానం అందరికీ అవసరం

న్యూస్ స్కూల్ హెడ్ మిస్ట్రెస్ గంట్ల పద్మ

**నల్లగొండ, బ్యూరో ( వార్త వేదిక సూర్య),ఫిబ్రవరి 28:**





నల్లగొండ పట్టణంలోని యాటకన్నా రెడ్డి కాలనీలో ఉన్న న్యూస్ పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెడ్ మిస్ట్రెస్ గంట్ల పద్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు మరి యు ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆమె ప్రసం గించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధునిక ప్రపంచంలో సైన్స్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని పేర్కొన్నారు. శాస్త్ర విజ్ఞానం మన జీవన విధానాన్ని సులభతరం చేయడంతో పాటు సమాజ అభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రయోగాత్మక జ్ఞానాన్ని కూడా సంపాదించుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే ప్రశ్నించే స్వభావం, పరిశోధనాత్మక ఆలోచన మరియు సృజనాత్మకతను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చని ఆమె అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ మోడల్స్, ప్రయోగాలు మరియు ప్రదర్శనలు నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు సైన్స్ యొక్క ప్రాముఖ్యత, శాస్త్రీయ ఆలోచన అవసరం మరియు రోజువారీ జీవితంలో సైన్స్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మిస్ట్రెస్ గంట్ల పద్మ, అలుగుబెల్లి తిరుమల్ రెడ్డి, స్పందన, శైలజ, జయమని, భీష్మ చారి, రక్షిత, భద్రమ్మ, నసీమ, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం చివరలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు.

యాదాద్రి భువనగిరి **వార్త వేదిక సూర్య** || యాదాద్రి భువనగిరి ఆదివారం మార్చి 1, 2026 ||
సంపుటి : 1 సంచిక : 274




## శ్రీలీలతో చిల్ అవుతున్న ఉస్తాద్ భగత్ సింగ్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా శ్రీలీల అలాగే రాశి ఖన్నా హీరోయిన్స్ గా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన అవైటెడ్ చిత్రమే "ఉస్తాద్ భగత్ సింగ్". మంచి మాస్ మసాలా ఎంటర్టైనర్ గా వస్తున్న ఈ భారీ సినిమా మంచి బజ్ ని ఫ్యాన్స్ లో సెట్ చేసుకుంది. అయితే ఇటీవల ఈ సినిమాకి ఓవర్సీస్ డీల్ ఇంకా పూర్తి కాలేదు అని టాక్ ఉన్న సంగతి తెలిసిందే. కానీ ఫైనల్ గా ఈ డీల్ కూడా పూర్తయ్యినట్టు కన్ఫర్మ్ అయ్యింది. మరి ఈ చిత్రాన్ని పవన్ గత చిత్రం ఓజి సొంతం చేసుకున్న ప్రత్యంగిరా వారే సొంతం చేసుకున్నారు. వీరి ద్వారానే నార్త్ అమెరికా మొత్తం ఈ సినిమా విడుదల కానుంది. ఇక ఈ అనౌన్సమెంట్ పై వదిలిన పోస్టర్ మాత్రం ఫ్యాన్స్ లో కొత్త అటెన్షన్ ని సొంతం చేసుకుంది. ఎందుకంటే ఇందులో పవన్ ఇది వరకు వచ్చిన అన్ని పోస్టర్స్ కి డిఫరెంట్ గా ఫన్ అండ్ చిల్ మోడ్ లో కనిపిస్తున్నారు. ఒక ఆకుపచ్చ రంగు కళ్ళజోడు చేతిలో గన్ ఇంకో పక్కన శ్రీలీల కనిపిస్తున్నారు. దీనితో ఈ ఊహించని షేడ్ పోస్టర్ మాత్రం ఫ్యాన్స్ లో కొత్త బజ్ ని క్రియేట్ చేసింది అని చెప్పొచ్చు. ఇక గ్రాండ్ గా ఈ సినిమా ఈ మార్చ్ 26న రిలీజ్ కి రాబోతుంది.




## ధురంధర్ 2 షాకింగ్ రన్ టైం లీక్?

ఇప్పుడు ఒక్క బాలీవుడ్ సినిమా మాత్రమే కాకుండా మొత్తం పాన్ ఇండియా ఆడియెన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న అవైటెడ్ బాలీవుడ్ సీక్వెల్ చిత్రమే "ధురంధర్ 2" (Dhurandhar 2). భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమాలో రణ్వీర్ సింగ్ హీరోగా నటించగా సారా అర్జున్ హీరోయిన్ గా నటించింది. ఇక ఈ సినిమాని ఆదిత్య ధర్ దర్శకత్వం వహించగా మొదటి పార్ట్ కే షాకింగ్ రన్ టైం వచ్చిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ థియేటర్స్ లో ఆడియెన్స్ కూర్చొని చూసారు. ఇక పార్ట్ 2 కూడా అంతే లెంగ్త్ తో ఉంటుంది అని ఆ మధ్య టాక్ వచ్చింది. కానీ ఒక పది నిమిషాలు తక్కువ ఉంటుందని వినిపించింది. కానీ ఫ్రెష్ లీక్ ఏంటంటే తక్కువ కాదు ఎక్కువ నిడివి తోనే ఈ సినిమా వస్తుందట. ఈసారి ఏకంగా 3 గంటల 40 నిమిషాల పాటు సినిమా ఉంటుందని ఓ రన్ టైం సినీ వర్గాల్లో వైరల్ గా మారింది. మరి ఇది ఎంతవరకు నిజం అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ చిత్రానికి జియో స్టూడియోస్ నిర్మాణం వహించగా ఈ మార్చ్ 19న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్లో ఈ సినిమా విడుదలకి రాబోతుంది.

## విజయ్, రష్మిక పెళ్లి..

### దేశవ్యాప్తంగా తమ పెళ్లికి జంట ఇచ్చిన బ్యూటిఫుల్ గిఫ్ట్ ఏంటో తెలుసా!

మన టాలీవుడ్ స్టార్ హీరో హీరోయిన్స్ విజయ్ దేవరకొండ అలాగే రష్మిక మందన్నా రీసెంట్ గానే పెళ్లి చేసుకొని ఒకటైన సంగతి తెలిసిందే. అయితే వీరి పెళ్ళికి గాను దేశ వ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సినీ ఇంకా రాజకీయ ప్రముఖులు ఏకంగా మోడీ, అమిత్ షా లు కూడా వీరికి తమ బెస్ట్ విషెస్ అందించారు. ఇలా ఒక పండుగలా వీరి పెళ్లి ఎంతో ఘనంగా జరుపుకున్నారు. పైగా సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా కూడా నార్త్, సౌత్ ఇలా అన్ని చోట్లా ఈ జంట కోసమే మాట్లాడుకున్నారు. మరి ఇంత ప్రేమ చూపించిన యావత్తు భారతదేశ ప్రజలకి వీరి సైడ్ నుంచి ఒక బ్యూటిఫుల్ గిఫ్ట్ ని పంపుతున్నట్టు తెలిపారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో కూడా కొన్ని ముఖ్య ప్రాంతాలు ఎంచుకొని అక్కడ తమ నుంచి గిఫ్ట్ గా మిఠాయిలు, పలు దేవాలయాల్లో భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇది మాత్రం ఒక ఊహించని బ్యూటిఫుల్ డెసిషన్ అని చెప్పాలి.



### రియల్ కబడ్డీ ప్లేయర్స్‌తో డా.ఆర్కే గౌడ్ నిర్మిస్తున్న

## మహిళా కబడ్డీ

తెలంగాణ ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ తన ఆర్కే ఫిలింస్ బ్యానర్ పై నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం మహిళా కబడ్డీ. ఈ చిత్రంలో ఇండియన్ వుమెన్స్ కబడ్డీ టీమ్ వైస్ కెప్టెన్ పూజ నర్వాల్, ఇండియన్ కబడ్డీ టీమ్ కోచ్ శ్రీనివాస్‌రెడ్డి, హీరో సుమన్, అక్సాఖాన్, తులసితో పాటు ఏడుగురు రియల్ కబడ్డీ ప్లేయర్స్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఈ చిత్ర వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూవీ టీమ్ ఇండియన్ వుమెన్స్ కబడ్డీ టీమ్ ప్లేయర్ పూజ నర్వాల్, ఇండియన్ కబడ్డీ టీమ్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, హీరో సుమన్, అక్సాఖాన్, తులసి, దర్శక నిర్మాత డా.ఆర్కే గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ కబడ్డీ టీమ్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పూజ నర్వాల్ వుమెన్ కబడ్డీ వరల్డ్ కప్ లో గోల్డ్ మెడలిస్ట్. నేను మన టీమ్ కు కోచ్ గా ఉన్నాను. ప్రో కబడ్డీ లీగ్ కు కోచ్ గా పనిచేశాను. త్వరలో వుమెన్ ప్రో కబ్బడీ లీగ్ కూడా రాబోతోంది. మహిళా కబడ్డీ సినిమా కోసం ఆర్కే గౌడ్ గారు నన్ను అప్రోచ్ అయ్యారు. మేమిద్దరం ఈ చిత్రంలో నటిస్తున్నాము. నాకు తెలిసిన విషయాలు ఆయనతో షేర్ చేసుకున్నాను. అలాగే ఇది మహిళల కబడ్డీ మూవీ కాబట్టి పూజ నర్వాల్ ను సంప్రదించి ఆమెతో ఈ కార్యక్రమంలో మాట్లాడిస్తే బాగుంటుందని అనుకున్నాం. క్రికెట్ తర్వాత కబడ్డీకే ఎక్కువ ఆదరణ ఉంది. క్రికెట్ లో మహిళల జట్టు ఎలా రాణిస్తున్నారో కబడ్డీ లోనూ అలాగే ప్రతిభ చాటుతున్నారు అన్నారు.

ఇండియన్ వుమెన్స్ కబడ్డీ టీమ్ ప్లేయర్ పూజ నర్వాల్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే నాకు కబడ్డీ ఆట మీద చాలా ఆసక్తి ఉండేది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెడల్స్ గెల్చుకున్న తర్వాత ఇప్పుడు నేషనల్, ఇంటర్నేషనల్ ప్లేయర్ గా ఎదిగాను. వుమెన్ కబడ్డీకి ఎంతో భవిష్యత్ ఉంది. మహిళలకు ప్రో కబడ్డీ లీగ్ కూడా ప్రారంభం కాబోతోంది. కబడ్డీని ప్రొఫెషనల్ గా ఎంచుకునే అమ్మాయిలకు మంచి భవిష్యత్ ఉంటుంది. ఇలాంటి టైమ్ లో ''మహిళా కబడ్డీ'' అనే సినిమాను ఆర్కే గౌడ్ రూపొందిస్తుండటం ఇందులో నేను కూడా నటించడం సంతోషంగా ఉంది అన్నారు.

దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ – నేను కూడా కబడ్డీ ప్లేయర్ ను. కబడ్డీ పోటీల్లో మా టీమ్ తరుపున ఛాంపియన్ షిప్ గెల్చుకున్నాం. అప్పుడు కబడ్డీ ప్లేయర్ గా జిల్లా స్థాయి వరకు వచ్చాను. మన దేశంలో క్రికెట్ తర్వాత కబడ్డీకి చాలా ఆదరణ దక్కుతోంది. గత రెండేళ్లుగా మన వాళ్లే ఛాంపియన్ షిప్ గెల్చుకున్నారు. మహిళల కబడ్డీలో పూజ నర్వాలాంటి ఎంతోమంది క్రీడాకారిణిలు ప్రతిభ చాటుతుండటం సంతోషంగా ఉంది. నేను మహిళా కబడ్డీ మూవీ కోసం వీళ్లను అప్రోచ్ అయ్యాను. కోచ్ శ్రీనివాసరెడ్డి ద్వారా పూజ గారిని సంప్రదించాం. వాళ్లిద్దరూ మా మూవీలో నటించడానికి అంగీకరించడం,ప్రెస్ మీట్ కు రావడం హ్యాపీగా ఉంది. పల్లెటూరి నుంచి వచ్చిన ఒక పేద అమ్మాయి కబడ్డీ ఆటలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలా పేరు తెచ్చుకుంది, ఆ క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంది అనే కథాంశంతో మహిళా కబడ్డీ చిత్రాన్ని రూపొందిస్తున్నాను. రియల్ కబడ్డీ ప్లేయర్స్ మా మూవీలో నటించబోతున్నారు. కోచ్‌గా శ్రీనివాస రెడ్డి నటిస్తున్నారు. తెలుగు, హిందీ భాషలలో రూపొందించే ఈ సినిమాలో అక్సాఖాన్ తో మరో హీరో హీరోయిన్ ని కూడా సెలెక్ట్ చేశాను. వీరితో పాటు సుమన్ గారు, ఆమని, ఇంద్రజ నటిస్తున్నారు. స్క్రిప్ట్ వర్క్ కంప్లీట్ అయ్యింది. సాంగ్స్ రికార్డింగ్ చేశాం. మంగ్లీ, మధు ప్రియ ఈ సాంగ్స్ పాడారు. స్క్రిప్ట్, పాటలు బాగా వచ్చాయి. త్వరలోనే మా చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకెళ్తాం అన్నారు. హీరో సుమన్ మాట్లాడుతూ.. తెలుగులో వస్తున్న మంచి స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీ ఇది. ఈ చిత్రంలో కూతురిని కబడ్డీ ప్లేయర్ గా ఉన్నతస్థాయికి తీసుకెళ్లే తండ్రి పాత్రలో నటిస్తున్నాను. నా స్నేహితుడు ఆర్కే గౌడ్ మంచి క్యారెక్టర్ నాకు ఇచ్చారు. పల్లెటూరి పేద ఫ్యామిలీ అమ్మాయి కబడ్డీలో దేశం గర్వించేలా ఎంత కష్టపడి ఎదిగింది అనేది ఈ సినిమాలో చూపించబోతున్నారు. నిజంగా కబడ్డీ రూల్స్ అన్నీ ఫాలో అవుతూ ఈ సినిమాను ఆర్కే గౌడ్ రూపొందిస్తున్నారు. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో సక్సెస్ అందుకోవాలి అన్నారు.

నటి అక్సాఖాన్ మాట్లాడుతూ.. మహిళా కబడ్డీ చిత్రంలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో కబడ్డీ ప్లేయర్‌గా నటిస్తున్నాను. ఈ చిత్రంతో నటిగా నాకు మంచి గుర్తింపు దక్కుతుందని ఆశిస్తున్నాను. సుమన్ గారు, మరికొందరు సీనియర్ యాక్టర్స్, మరియు రియల్ కబడ్డీ ప్లేయర్స్ తో కలిసి ఈ సినిమాలో నటించబోతున్నాను. కబ్బడీ ప్లేయర్స్ కావాలనుకునే అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చేలా ఈ సినిమా ఉంటుంది అన్నారు. కబడ్డీ ప్లేయర్ రాధిక రెడ్డి మాటాడుతూ.. 1997లో ఉమ్మడి ఏపీకి నేషనల్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాను. ఇప్పటిదాకా అదొక్కసారే మనకు గోల్డ్ మెడల్ వచ్చింది. ఈ సినిమా కింద స్థాయి నుంచి కబడ్డీలో ఎదిగేందుకు ప్రయత్నించే అమ్మాయిలకు ఇన్స్పిరేషన్ కావాలి. త్వరలో రాబోతున్న మహిళా కబడ్డీ ప్రో లీగ్ కూడా సక్సెస్ కావాలి అన్నారు. నటి తులసి మాట్లాడుతూ.. మహిళా కబడ్డీ చిత్రంలో నేను కూడా మంచి పాత్రలో నటిస్తున్నాను. ఈ ఆకాశం ఇచ్చిన ఆర్కే గౌడ్ గారికి కృతజ్ఞతలు అన్నారు.

*నటీనటులు: పూజ నర్వాల్, శ్రీనివాస రెడ్డి, అక్సాఖాన్, సుమన్, ఆమని, ఇంద్రజ, పూజ నర్వాల్, కోచ్ శ్రీనివాస రెడ్డి, తదితరులున్నారు.*




### కనకదుర్గమ్మ సన్నిధిలో

## మంత్రి వెంకట్ రెడ్డి

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 28 (వార్తా వేదిక సూర్య):**

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శనివారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రికి అర్చకులు ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేయగా.. దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యులు జ్ఞాపిక బహూకరించి, శాలువాతో సత్కరించారు.

**భక్తులకు ఆత్మీయ పలకరింపు**

కనకదుర్గమ్మ దర్శనానికి విచ్చేసిన రెండు తెలుగు రాష్ట్రాల భక్తులను మంత్రి వెంకట్ రెడ్డి ఆత్మీయంగా పలకరించారు. వారి అభివాదాలను స్వీకరించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మంత్రి మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారిపై తనకు అపార భక్తి ఉందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## కీసర పీఎస్‌లో ఏసీబీ దాడులు

**మేడ్చల్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 28:**

కీసర పోలీసు స్టేషన్‌లో ఏసీబీ అదికారులు దాడులు నిర్వహించారు.35 వేల రూపాయలు లంచం తీసుకుంటూ హోంగార్డ్ నగేష్ దొరికిపోయాడు. హోంగార్డ్ నగేష్ గాంధీ ఆసుపత్రి డాక్టర్ సందీప్ పేరు చెప్పి పోస్ట్ మార్టం రిపోర్ట్ కావాలంటే మొదట 2 లక్షలు డిమాండ్ చేసాడు. నెలలు గడుస్తున్న కొద్దీ మృతుడి మేనల్లుడు శరత్ చివరకు 40 వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. , మొదట 5 వేలు తీసుకున్న హోంగార్డ్ నగేష్ , రెండవ విడత 35 వేలు తీసుకుంటుండగా పట్టుబడ్డాడు. తోటకూర మహేష్ చనిపోయి నాలుగు నెలలు అవుతున్నా మృతుడి పోస్ట్ మర్టం రిపోర్ట్ కోసం ఎంత తిరిగినా ఇవ్వలేదని బాధితుడి ఆరోపణ..





కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



తమ వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్తున్న కార్పొరేటర్

## నల్లగొండను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుదాం

• మేయర్ బుర్రి చైతన్యశ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ టౌన్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 28:**

నల్లగొండ నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేద్దామని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ కార్పొరేషన్ తొలి సమావేశం శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమన్నారు. అందుకు కార్పొరేటర్లు అందరూ సహకరించాలని కోరారు. ఏ చిన్న సమస్య వచ్చినా రాజకీయాలను పక్కనపెట్టి పరిష్కరించుకోవాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి సహకారంతో మరిన్ని నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధికి బాటలు వేద్దామన్నారు. నల్లగొండ పట్టణ ప్రజలందరికీ 24 గంటలు తాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఐదు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో ఒకటి పూర్తి అయిందని, మిగతా వాటిని కూడా త్వరలో పూర్తి చేసి వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చూస్తామని చెప్పారు. ప్రకాశం బజారులో నిరంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, అందుకే అక్కడ ఉన్న వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా మరోచోట దుకాణాలు ఏర్పాటు చేశామని, అక్కడ వారికి అవసరమైన వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.

**మేయర్ దృష్టికి సమస్యలు**

ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ డివిజన పరిధిలో నెలకొన్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వీధి దీపాలు లేవని, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, దోమల బెడద విపరీతంగా ఉందని మేయర్ దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్ చంద్ర, డిప్యూటీ మేయర్ అమేర్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, మందడి లిఖిత సైదిరెడ్డి, అబ్బ గోని కవిత, బోయినపల్లి వేదశ్రీ, యమ కవితారాణి, రేగట్టే అండాలు, దాసరి సాయి, రామగిరి అఖిల్, ఇబ్రహీం, కేసాని వేణుగోపాల్ రెడ్డి, రత్నపురం తారకమ్మ, ఇటుకల మంగమ్మ, డిప్లా నాయక్, మల్లేశ్వరి, గోపగాని స్వాతి, పెరిక యాదయ్య, అల్లి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**